క్లుప్తంగా

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

చంద్రగిరి: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారి తొండవాడ సమీపంలోని హ్యాపీ దాబా వద్ద సోమవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. సుమారు 45 సంవత్సరాల వయస్సు కలిగిన గుర్తుతెలియని వ్యక్తి రోడ్డు దాటుతున్న సమయంలో చిత్తూరు నుంచి తిరుపతి వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో వ్యక్తి తలపై వాహనం వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. ఈ మేరకు మృతదేహానికి పంచనామా పూర్తి చేసి, పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి మెడికల్ కళాశాలకు తరలించినట్లు ఏఎస్ఐ సుధాకర్ తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు చంద్రగిరి పోలీసులను సంప్రదించాలని కోరారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్


గంజాయిని, ముద్దాయిలను చూపుతున్న సీఐ సుదర్శన్‌ప్రసాద్, పోలీసులు

పాకాల: అక్రమంగా గంజాయిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను స్థానిక పోలీసులు ఆదివారం అరెస్ట్ చేసినట్టు సీఐ సుందర్శన్‌ప్రసాద్ తెలిపారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆవివరాలను విలేకరులకు వివరించారు. ఆదివారం ఉదయం 11.30 గంటలకు వచ్చిన సమాచారం మేరకు నెల్లూరు రూరల్ మండలం, మేకలవారితోటకు చెందిన సాన విష్ణుమోహన్‌రెడ్డి(24), తమిళనాడు రాష్ట్రం, తేని జిల్లా, ఉత్తమపాళెం తాలూకా, కంభం గ్రామానికి చెందిన పాండియన్(31)ని పాకాల రైల్వేస్టేషన్‌లో అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వీరి నుంచి 13 కిలోల గంజాయిని, 2 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ముద్దాయిలు ఇద్దరూ విజయవాడ నుంచి మదురైకి గంజాయిని తరలించడానికి పాకాల రైల్వే స్టేషన్‌కి చేరుకున్నట్టు వెల్లడించారు. అదే రోజు మదురైకి రైలు లేకపోవడంతో కాట్పాడికి వెళ్లి అక్కడి నుంచి మదురైకి వెళ్లడానికి నిశ్చయించుకున్నారని తెలిపారు. పక్కా సమాచారం రావడంతో సీఐ, ఎస్ఐ సంజీవరాయుడు, తహసీల్దార్ సంతోష్‌సాయిలు, సిబ్బంది రైల్వే స్టేషన్‌కి చేరుకుని ముద్దాయిలను అరెస్టు చేసినట్టు చెప్పారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 6 కంపార్ట్‌మెంట్లు నిండాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 75,706 మంది స్వామివారిని దర్శించుకోగా 23,340 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.34 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

వైభవంగా వసంత పంచమి


జీసీ వెల్ఫేర్ పాఠశాలలో..

తిరుపతి సిటీ : నగరంలోని పలు విద్యాసంస్థలలో వసంత పంచమి సందర్భంగా సరస్వతీ పూజను ఘనంగా నిర్వహించారు. ఎస్వీ వేదిక్ వర్సిటీలో వీసీ రాణి సదాశివమూర్తి ఆధ్వర్యంలో పూజలు చేశారు. సింహచల దేవస్థానం అర్చకులు ఆర్.సౌందరరాజాచార్యులు, సీతారామచార్యులు, రిజిస్ట్రార్ తారకరామ కుమారశర్మ, డీన్ సుబ్రమణ్యంశర్మ, డాక్టర్ బ్రహ్మాచార్యులు పాల్గొన్నారు. ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాలలో సరస్వతీ పూజ జరిపించారు. ప్రిన్సిపల్ సత్యనారాయణ పాల్గొన్నారు. ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో ప్రిన్సిపల్ వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో వసంత పంచమి నిర్వహించారు. గరికపాటి రమేష్‌బాబు, అధ్యాపకులు భీమన్న, లోకనాథ్, వెంకటేశ్వర్లు, ప్రసాద్, తేజోవాణి పాల్గొన్నారు. అలాగే జూపార్క్ రోడ్డులోని మహాత్మ జ్యోతిబా పూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల ఉదయమాణిక్యం బ్రాంచ్ పాఠశాలలో వసంత పంచమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపల్ రేష్మ పాల్గొన్నారు

శాస్త్రోక్తంగా అక్షరాభ్యాసం

తిరుపతి కల్చరల్ : జ్ఞాన సరస్వతీదేవి జన్మనక్షత్రమైన వసంత పంచమిని పురస్కరించుకుని చిగోర ఆధ్యాత్మిక సేవా కేంద్రంలో సోమవారం శాస్త్రోక్తంగా 80 మంది చిన్నారులకు అక్షరాభ్యాసం చేపట్టారు. పదోతరగతి విద్యార్థులకు సరస్వతి కంకణాలు పంపిణీ చేశారు. డాక్టర్ స్వరాజ్యలక్ష్మి, అక్కిరాజు శమంతకమణి, జీఎస్.లక్ష్మీ కృష్ణమూర్తి, చిత్రపు హనుమంతరావు, సీఆర్‌కే.శేషగిరిరావు, భాగవంతుల జయలక్ష్మి, అపర్ణ, లీలావతి, దూబగుంట రామకృష్ణ, పద్మావతి, కామేశ్వరరావు, ఎంఎస్.విశ్వనాథ్ పాల్గొన్నారు.

వీక్ష ది స్కూల్‌లో..

స్థానిక బైరాగిపట్టెడలోని వీక్ష ది స్కూల్‌లో పిల్లలకు అక్షరాభ్యాసం నిర్వహించారు. వేదపండితుల చేతుల మీదుగా చిన్నారులతో అక్షరాలు దిద్దించారు. పాఠశాల డైరెక్టర్ తాతిరెడ్డి రామకృష్ణారెడ్డి, డైరెక్టర్ విమలా రెడ్డి, డీజీ రఘునారాయణరావు, అనగాని రెడ్డెప్ప పాల్గొన్నారు.

తిరుపతి ఎడ్యుకేషన్ : వసంత పంచమి సందర్భంగా సోక్రటీస్ ఐకాన్ హైస్కూల్లో అక్షరాభ్యాసం నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ కె.ప్రదీప్‌రెడ్డి పాల్గొన్నారు.


సరస్వతీ పూజలో ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు


వీక్ష ది స్కూల్‌లో..


ఓంకారం దిద్దుతున్న చిన్నారులు

6న తిరుపతిలో జాబ్ మేళా

తిరుపతి అర్బన్: తిరుపతి పద్మావతిపురంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈ నెల 6న జాబ్ మేళా నిర్వహించనున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఆర్. లోకనాథం తెలిపారు. ఉదయం 9గంటల నుంచి జాబ్ మేళా ప్రారంభమవుతుందని, పలు కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలకు హాజరుకానున్నట్టు వెల్లడించారు. 10వ తరగతి, ఇంటర్ , ఏదైనా డిగ్రీ, ఐటీఐ చదువుకున్న యువతీ యువకులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు ఆ మేరకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని చెప్పారు. అదనపు సమాచారం కోసం 9030527160ను సంప్రదించాలని సూచించారు.

కెరీర్ గైడెన్స్‌పై అవగాహన

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి కేటీ రోడ్డులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం బయో మెడికల్ ఇంజినీరింగ్, కంప్యూటర్ ఇంజినీరింగ్ విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎస్వీయూ ఎంప్లాయిస్ బ్యూరో డెప్యూటీ చీఫ్ టీ.శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తమ కెరియర్‌పై అవగాహన ఏర్పరుచుకోవాలని తెలిపారు. డిప్లొమా మొదటి ఏడాదే లక్ష్యాలను నిర్దేశించుకుని ఆ లక్ష్య సాధనకు పట్టుదలతో కృషి చేయాలని చెప్పారు. పర్సనాలిటీ డెవెలెప్‌మెంట్‌కు ఎక్స్‌ట్రా కరికులమ్ యాక్టివిటీస్‌లో పాల్గొనాలని సూచించారు.

స్థలం కేటాయింపునకు వినతి


డీపీటీఓకు వినతిపత్రం అందిస్తున్న ఐసీడీఎస్ పీడీ

తిరుపతి అర్బన్ : ఆర్టీసీ బస్టాండ్‌లో చైల్డ్ హెల్ప్ డెస్క్ ఏర్పాటు కోసం స్థలం కేటాయించాలని ఐసీడీఎస్ పీడీ ఎస్. వసంతాబాయి కోరారు. సోమవారం ఈ మేరకు డీపీటీఓ నరసింహులుకు వినతిపత్రం అందించారు. ఆయన పరిశీలించి చైల్డ్ హెల్ప్ డెస్క్ నిర్వహణకు స్థల కేటాయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ అధికారి శివశంకర్ పాల్గొన్నారు.

తుమ్మలగుంటలో
నేడు రథసప్తమి వేడుకలు


తుమ్మలగుంటలో రథసప్తమి వేడుకలకు సర్వాంగ సుందరంగా ముస్తాబైన శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం

తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండలం, తుమ్మలగుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో రథసప్తమి వేడుకలను అత్యంత రమణీయంగా నిర్వహించనున్నారు. మంగళవారం ఉదయం 6 నుంచి సప్త వాహనాలు (ఏడు వాహనాలు)పై స్వామివారు ఊరేగుతూ భక్తులను కటాక్షించనున్నారు. ముందుగా స్వామి, అమ్మవార్లు సూర్యప్రభ వాహనంపై ఊరేగనున్నారు. ఆ తర్వాత వరుసగా చిన్న శేష వాహనం, గరుడ వాహనం, హనుమంత వాహనం, కల్పవృక్ష వాహనం, సర్వభూపాల వాహనం, చంద్రప్రభ వాహనాలపై ఊరేగనున్నారు. ఒక్క రోజు బ్రహ్మోత్సవంగా పిలిచే రథసప్తమి పర్వదినాన శ్రీనివాసుని దర్శనం చేసుకుంటే సకల శుభాలు కలుగుతాయని భక్తుల విశ్వాసం. తిరమల తరహాలో వైఖానస ఆగమోక్తంగా నిర్వహించే రథసప్తమి ఉత్సవాలను తిలకించేందుకు తరలి వచ్చే భక్తులకు ఎక్కడా అసౌకర్యం కలగకుండా ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. రథసప్తమి వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లను ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి పర్యవేక్షించారు.

పోలీస్ అదనపు బలగాల ఏర్పాటు

తిరుపతి అర్బన్: తిరుపతి నగరపాలక డెప్యూటీ మేయర్ ఎన్నిక నేపథ్యంలో మంగళవారం అదనపు పోలీస్ బలగాలను ఏర్పాటు చేయనున్నట్టు జిల్లా మెజిస్ట్రేట్, కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం కోరం లేకపోవడంతో మంగళవారానికి వాయిదా వేశామని వెల్లడించారు. శాంతి భద్రతల పరిరక్షణ నేపథ్యంలో 250 మంది అదనపు పోలీస్ బలగాలను ఏర్పాటు చేయనున్నట్టు పేర్కొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడినా చట్టరీత్యా చర్యలుంటాయని హెచ్చరించారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

డెప్యూటీ మేయర్ ఎన్నిక నేడు

తిరుపతి నగరపాలక సంస్థ డెప్యూటీ మేయర్ ఎన్నిక సోమవారం నిర్వహించడానికి కోరం లేకపోవడంతోనే మంగళవారానికి వాయిదా వేశామని జేసీ, ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి శుభం బన్సల్ తెలిపారు. ప్రస్తుతం తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలో 47 మంది కార్పొరేటర్లు ఉన్నారని, అంతే కాకుండా ముగ్గురు ఎక్స్ అఫీషియో సభ్యులు ఉన్నారని చెప్పారు. మొత్తం 50 మందిలో కోరం ప్రకారం 25 మంది హాజరుకావాల్సి ఉందని వెల్లడించారు. అయితే సోమవారం 22 మంది హాజరుకావడంతో మంగళవారానికి వాయిదా వేసినట్లు స్పష్టం చేశారు.

ఎస్వీయూ అష్ట దిగ్బంధం

తిరుపతి సిటీ: ఎస్వీయూను పోలీసులు అష్టదిగ్బంధం చేశారు. సోమవారం నగరపాలక సంస్థ డెప్యూటీ మేయర్ ఎన్నిక నేపథ్యంలో వేల సంఖ్యలో పోలీసులు వర్సిటీలో ఉదయం 6 నుంచే హల్‌చల్ చేశారు. వర్సిటీ పరిపాలనా భవనానికి వెళ్లే అన్ని దారుల్లో బారికేడ్లు ఏర్పాటు చేశారు. వర్సిటీకి అధికారులు సోమవారం సెలవు ప్రకటించారు. వర్సిటీ ఆవరణలోని మెన్, ఉమెన్ హాస్టల్స్‌లో ఉన్న విద్యార్థులు ఇబ్బందులకు గురయ్యారు. కనీసం మెస్‌లకు వెళ్లేందుకు, వర్సిటీ నుంచి నిత్యావసరాలు కొనుగోలు చేసేందుకు బయటకు వెళ్లేందుకు వీలు లేకుండా అడ్డుకున్నారు. బయటకు వెళ్లిన విద్యార్థులను వర్సిటీలోనికి అనుమతించకపోవడంతో విద్యార్థులు రోడ్లపైనే పడిగాపులు కాశారు.

కూటమి రణరంగం

తిరుపతి గాంధీరోడ్డు: తిరుపతి డెప్యూటీ మేయర్ ఉప ఎన్నికల్లో సోమవారం కూటమి ప్రభుత్వం రణరంగం సృష్టించింది. అధికారుల వత్తాసుతో దుశ్చర్యకు ఒడిగట్టింది. మెజారిటీ లేకున్నా తామే గెలవాలన్న లక్ష్యంతో ఒక్క సభ్యుడు ఉన్న టీడీపీ అరాచక రాజకీయాలకు పరాకాష్టగా మారింది. ఈ క్రమంలో సోమవారం యూనివర్సిటీ ప్రాంగణంలో సజావుగా జరగాల్సిన ఎన్నిక వాయిదా పడింది.

మండిపడుతున్న జర్నలిస్ట్ సంఘాలు

యూనివర్సిటీ ప్రాంగణంలో విధులు నిర్వహిస్తున్న సాక్షి ప్రతినిధి తిరుమల రవిరెడ్డి, ఫొటో జర్నలిస్ట్ గిరిప్రసాద్ రెడ్డిపై టీడీపీ, జనసేన నాయకులు విరుచుకుపడ్డారు. కెమెరా లాక్కుని పైశాచికంగా దాడి చేశారు. ఈ దాడిలో గిరిప్రసాద్‌రెడ్డి చేతికి తీవ్ర గాయమైంది. దీనిపై జర్నలిస్ట్ సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

పూర్తిస్థాయిలో స్పెషల్ బ్రాంచ్ వైఫల్యం

డెప్యూటీ మేయర్ ఎన్నికలో స్పెషల్ బ్రాంచ్ పోలీసులు వైఫల్యం చెందారు. టీడీపీ, జనసేన గూండాలు రెచ్చిపోతున్నా తమకెందుకులే అన్నట్టు చూసీచూడనట్టు వదిలేశారు. లా అండ్ ఆర్డర్ అదనపు ఎస్పీ రవిమనోహరాచారి, స్పెషల్ బ్యాంక్ డీఎస్పీ గిరిధర్ ఉన్నా ప్రయోజనం లేకపోయింది.

మూడు ఇసుక ట్రాక్టర్లు సీజ్



చంద్రగిరి: ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న మూడు ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులు సీజ్ చేసిన ఘటన సోమవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. గత కొద్ది రోజులుగా స్వర్ణముఖి నదిలో నిరంతరం అక్రమ ఇసుక రవాణా సాగుతోంది. ఈ క్రమంలో పెద్ద ఎత్తున ప్రజల నుంచి వ్యతిరేకత వచ్చింది. దీంతో సోమవారం తెల్లవారుజామున రెవెన్యూ, పోలీసు అధికారులు దాడులు జరిపారు. ఈ దాడుల్లో మూడు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని, స్థానిక పోలీసు స్టేషన్‌కు తరలించారు. అయితే ట్రాక్టర్లలో ఇసుకను నింపుతున్న జేసీబీని మాత్రం అధికారులు వదిలేశారు. ఈ మేరకు సీజ్ చేసిన ట్రాక్టర్లపై కేసులు నమోదు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

ఇవి కనిపించడం లేదా?

వారం రోజులుగా హిటాచీ, జేసీబీల సాయంతో టిప్పర్ల ద్వారా వందలాది వాహనాలు పగలు, రాత్రి తేడా లేకుండా అక్రమ ఇసుక రవాణా చేస్తుంటే అధికార యంత్రాంగానికి కనిపించడం లేదా..? అంటూ ట్రాక్టర్ల యజమానులు మండిపడుతున్నారు. రెడ్డివారిపల్లి, నాగయ్యగారిపల్లిలో యంత్రాల సాయంతో నిత్యం ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారన్నారు. అధికార అండతో అక్రమంగా రవాణా చేస్తున్న వారి జోలికి వెళ్లకుండా, ఇలా తమ లాంటి చిన్నవారిపై కేసులు నమోదు చేయడం దారుణమన్నారు.

బీఫార్మసీ కోర్సులో స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీలో ఈ నెల 5వ తేదీన బీ ఫార్మసీ కోర్సులో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ఫార్మసీ విభాగాధిపతి ఎస్.జోష్నారాణి తెలిపారు. అర్హత కలిగిన బైపీసీ మహిళా అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో వర్సిటీలో ఫార్మసీ విభాగానికి బుధవారం ఉదయం 10 గంటలకు హాజరుకావాలని కోరారు. మరిన్ని వివరాలకోసం వర్సిటీ అధికారిక వెబ్‌సైట్‌ను గానీ, 9491537604 ఫోన్ నంబర్‌లో గానీ సంప్రదించాలని సూచించారు.

ఎస్వీయూ బీ ఫార్మసీ కోర్స్‌కు స్పాట్ అడ్మిషన్లు

ఎస్వీయూలో బీఫార్మసీ కోర్సులో చేరదలచిన వారికి స్పాట్ అడ్మిషన్లు 5వ తేదీ బుధవారం నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ భూపతి నాయుడు తెలిపారు. ఈఏపీ సెట్–2024లో అర్హత సాధించిన అభ్యర్థులకు తొలి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.ఎంపీసీ, బైపీసీ చదివిన విద్యార్థులకు అవకాశం ఉంటుందని, ఆసక్తిగల అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో వర్సిటీలోని డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

నడక దారిలో ఆకస్మిక తనిఖీలు

తిరుమల: అలిపిరి నడక మార్గంలోని మోకాలి మిట్ట వద్ద సోమవారం టీటీడీ ఈఓ జె.శ్యామలరావు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. నడక మార్గంలోని మరుగుదొడ్లను పరిశీలించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఎప్పటికప్పుడు మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచాలని అక్కడున్న సిబ్బందిని ఆదేశించారు. అంబులెన్స్ సర్వీసును పరిశీలించారు. అనంతరం తిరుమలకు వస్తున్న భక్తులతో మాట్లాడి నడక దారిలో టీటీడీ ఏర్పాటు చేసిన సౌకర్యాల గురించి అభిప్రాయాలు సేకరించారు.

ఎన్‌ఏఆర్‌ఎల్‌లో స్వచ్ఛతా పక్వాడ వారోత్సవాలు


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎన్‌ఏఆర్‌ఎల్ అధికారులు


పాకాల: మండలంలోని గాదంకి ఎన్‌ఏఆర్‌ఎల్‌లో స్వచ్ఛతా పక్వాడ వారోత్సవాలను ఎన్‌ఏఆర్‌ఎల్ డైరెక్టర్ డాక్టర్ అమిత్‌కుమార్ పాత్ర అధ్యక్షతన ప్రారంభించారు. సోమవారం స్వచ్ఛతా పక్వాడ కార్యక్రమాల నిర్వహణ మానిటరింగ్ కమిటీని నియమించారు. అందులో శాస్త్రవేత్త పీ.రవిప్రసాద్, ఎం.శ్రీనివాస గుప్తా, బీ.మల్లికామాధురి, ఏఓ జీ.హరివెంకటకుమార్, కేవీ.శిజి ఉన్నారు. కార్యక్రమంలో భాగంగా సిబ్బంది, అధికారులందరూ స్వచ్ఛతా పక్వాడ ప్రతిజ్ఞ చేశారు. వారోత్సవాల్లో ప్లాస్టిక్ రహిత సమాజం, క్యాంపస్ పరిసర ప్రాంతాల్లోని గ్రామాల్లో పరిశుభ్రతపై అవగాహన కల్పించడం, కరపత్రాలు పంచడం, స్వచ్ఛతపై బ్యానర్లతో ప్రదర్శన ఏర్పాటు చేయడం, జూట్ బ్యాగుల పంపిణీ వంటి కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

వైభవంగా దత్తాత్రేయుని విగ్రహ ప్రతిష్ట



తిరుపతి రూరల్ : తిరుచానూరు స్వర్ణముఖి నది తీరంలోని నందనవనం రోడ్డులో నూతనంగా నిర్మించిన ఆలయంలో దత్తాత్రేయ స్వామి విగ్రహ ప్రతిష్ట, ఆలయ కుంభాభిషేక మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఎస్వీయూ విశ్రాంత అధ్యాపకుడు కందుకూరు శేషయ్య సొంత నిధులతో నిర్మించిన దత్తాత్రేయ ఆలయాన్ని రాయల చెరువు పీఠాధీశ్వరి మాతా రామ్యానంద భారతీ మహా స్వామి వారు ప్రారంభించారు. బీజేపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ మాట్లాడుతూ హిందూ సనాతన ధర్మం మరింతగా పటిష్టం కావాలని కోరారు.

రుయాలో ఓపీ తిప్పలు


ఓపీ కోసం బారులు తీరిన రోగులు, సహాయకులు

తిరుపతి తుడా : రుయా ఆస్పత్రి అత్యవసర విభాగం ఓపీ కేంద్రంలో సోమవారం గంటకుపైగా సర్వర్ పనిచేయకపోవడంతో రోగులకు తిప్పలు తప్పలేదు. దీంతో సకాలంలో వైద్యసేవలు అందలేదని రోగులు ఆవేదన వ్యక్తం చేశారు.

తిరుమలలో రథసప్తమి ఏర్పాట్ల పరిశీలన


ఆలయ మాడ వీధుల్లో పరిశీలిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్ రాజు

తిరుమల: తిరుమలలో మంగళవారం రథసప్తమి నిర్వహించనున్న సందర్భంగా తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు సోమవారం తిరుమలలో భద్రతా ఏర్పాట్లు పరిశీలించారు. ఆలయ నాలుగు మాడ వీధులు, గ్యాలరీలు పార్కింగ్ ప్రదేశాలను ఆయన స్వయంగా పరిశీలించారు. భద్రతాపరంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, తిరుమలలో ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచించారు. భక్తులు ఎక్కువగా ఏ సమయంలో వస్తారో... గుర్తించి ఆ సమయంలో ప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు వెంకట్రావు, రామకృష్ణ, పలువురు డీఎస్పీలు, సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

కదంతొక్కిన వెటర్నరీ విద్యార్థులు


నిరసన వ్యక్తం చేస్తున్న వెటర్నరీ జూడాలు


వర్సిటీలో గౌరవవేతనం పెంచాలంటూ నినదిస్తూ ర్యాలీ చేస్తున్న జూడాలు

తిరుపతి సిటీ: వెటర్నరీ జూడాల నిరసనలు, ర్యాలీలతో ఎస్వీ వెటర్నరీ వర్సిటీ దద్దరిల్లింది. గౌరవవేతనం చెల్లింపు విషయంలో వెటర్నరీ వైద్య విద్యార్థుల పట్ల ప్రభుత్వ పక్షపాత ధోరణితో వ్యవహరిస్తోందని, ఎంబీబీఎస్ విద్యార్థులకు ఇచ్చే గౌరవవేతనాన్ని తమకు అమలు చేయాలని ఆదివారం నుంచి వర్సిటీలో ప్లకార్డులు చేతబూని ధర్నాలు, ర్యాలీతో కదంతొక్కారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా తమకు రూ.7 వేలు మాత్రమే గౌరవ వేతనం అందిస్తున్నారని, ఎంబీబీఎస్ విద్యార్థులకు రూ.26వేలు చెల్లిస్తూ పనిచేసే ప్రాంతంలో మౌలిక సదుపాయాల కల్పన, టీఏ, డీఏలు చెల్లిస్తున్నారని తెలిపారు. తమ పట్ల ప్రభుత్వం, వర్సిటీ అధికారులు వ్యవహరిస్తున్న తీరు దారుణమని మండిపడ్డారు. తక్షణం గౌరవవేతనాన్ని రూ. 30వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కరించకుంటే ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. యూజీ, పీజీ వైద్యవిద్యార్థులు పాల్గొన్నారు.

అర్జీలకు పరిష్కారం చూపండి


అర్జీలను పరిశీలిస్తున్న కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్: అర్జీలకు పరిష్కారం చూపాలని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదికకు కలెక్టర్‌తోపాటు జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 220 అర్జీలు వచ్చాయి. అందులో 116 అర్జీలు రెవెన్యూ సమస్యలపైనే ఉన్నాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు వెయ్యి మందికి పైగా ప్రజలు తరలివచ్చారు. కలెక్టర్ మాట్లాడుతూ సచివాలయం నుంచి మండల కార్యాలయాలు, డివిజన్ కార్యాలయాల పరిధిలో పరిష్కారమయ్యే సమస్యలను అక్కడే పరిష్కరించాలని సూచించారు. నిర్లక్ష్యంగా వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

క్లుప్తంగా

అంగన్‌వాడీ సంఘానికి నూతన కమిటీ


సుజాత


నాగరత్న

తిరుపతి కల్చరల్ : ఏపీ ప్రగతిశీల అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ తిరుపతి నగర నూతన కమిటీని సోమవారం ఎనుకున్నట్లు ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాయపనేని హరికృష్ణ తెలిపారు. నగర కమిటీ అధ్యక్షులుగా సుజాత, కార్యదర్శిగా నాగరత్న, కోశాధికారిగా నిర్మల, ఉపాధ్యక్షులుగా విమల, శశికళ, సంగీత, కె.సుజాత, సహాయ కార్యదర్శులుగా కళావతి, యాస్మిన్ హేమ, రామలక్ష్మి ఎన్నికైనట్లు వెల్లడించారు.

ఈడిగ సంఘం మండలాధ్యక్షుడికి నివాళి


ఆర్థిక సాయం అందిస్తున్న నేతలు

పాకాల : మండలంలోని చిగరపల్లెలో ఈడిగ గౌడ సంఘం పాకాల మండలాధ్యక్షుడు వి.విజయ్‌కుమార్‌గౌడ్(73)మృతి చెందారు. సోమవారం ఈ మేరకు సంఘం సభ్యులు గ్రామానికి వెళ్లి ఆయన భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంత్యక్రియలకు రూ.30వేల నగదును కుటుంబీకులకు అందజేశారు. కార్యక్రమంలో సంఘం నేతలు శ్రీనివాసులుగౌడ్, దొరరాజుగౌడ్, మోహన్‌గౌడ్, రెడ్డెప్పగౌడ్, వేణుగౌడ్, మంజుగౌడ్, పురుషోత్తంగౌడ్, సురేష్‌గౌడ్ పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ


స్టడీ మెటీరియల్‌తో విద్యార్థులు, ఉపాధ్యాయులు

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి బైరాగిపట్టెడలోని ఎంజీఎం నగరపాలక ఉన్నత పాఠశాలలో 108 మంది పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను సోమవారం మబ్బు సూర్యనారాయణరెడ్డి చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు అందించారు. డీవైఈఓ కె.బాలాజీ మాట్లాడుతూ పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులతో విజయం సాధించేందుకు ఈ స్టడీ మెటీరియల్ దోహదపడుతుందని తెలిపారు. విద్యార్థులు పరీక్షలపై భయాన్ని వీడాలని, కష్టంతో కాకుండా ఇష్టంతో చదివితే విజయం తథ్యమని సూచించారు. దాత మబ్బు సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రణాళికబద్ధంగా చదివితే మంచి మార్కులు సాధించవచ్చని వెల్లడించారు. కార్యక్రమంలో ఎంఈఓ భాస్కర్ నాయక్, విశ్వం విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఎస్.విశ్వనాథరెడ్డి, హెచ్ఎం ఎం.మునిశారద, ఉపాధ్యాయులు బండి మధుసూదన్‌రెడ్డి, మురుగన్, భాస్కర్, హేమాద్రి బాబు, ఉషారాణి పాల్గొన్నారు.

ప్రతి నెలా ఒకటో తారీఖు వచ్చిందంటే ఉద్యోగులు వణికిపోతున్నారు. ప్రభుత్వం సకాలంలో వేతనాలు వేయకపోవడంతో ఈఎంఐల చెల్లింపులకు ఇబ్బంది పడుతున్నారు. బ్యాంకులు.. ఫైనాన్స్ సంస్థలు విధించే అపరాధ రుసుమును భరించలేక తల్లడిల్లిపోతున్నారు. ఖాతాలో నగదు లేక చెక్‌బౌన్స్ చార్జీల భారంతో దిక్కుతోచక కొట్టుమిట్టాడుతున్నారు. ఈ క్రమంలోనే సిబిల్ స్కోర్ పడిపోతుండడంతో క్రెడిబులిటీని కోల్పోయి అవమానాల పాలవుతున్నారు. చివరకు వడ్డీ వ్యాపారుల చేతికి చిక్కి శల్యమవుతున్నారు. జీతంలో సగభాగం అదనపు చెల్లింపులకే సరిపోవడంతో కుటుంబ పోషణకు మళ్లీ అప్పుల కోసం చేయి చాచే దయనీయస్థితికి దిగజారుతున్నారు. అలాగే పెన్షనర్లు సైతం ఇవే అనుభవాలతో అనుక్షణం ఇక్కట్లు పడుతున్నారు.



అమ్మో ఒకటో తారీఖు!

- సకాలంలో వేతనాలు అందక ఉద్యోగుల అవస్థలు
- ఈఎంఐలు కట్టలేక ఇక్కట్లు
- చెక్‌బౌన్స్‌లతో పడిపోతున్న సిబిల్ స్కోర్లు
- నూతన రుణాలు మంజూరు కాకపోవడంతో ఇబ్బందులు
- దిక్కుతోచక కొట్టుమిట్టాడుతున్న వేతన జీవులు

తిరుపతి సిటీ : నెల ప్రారంభమైందంటే ఉద్యోగుల అవస్థలు వర్ణనాతీతం. ఈఎమ్‌ఐల డ్యూ డేట్ మెసేజ్‌లతో సెల్‌ఫోన్ నిండిపోతుంటుంది. గృహోపకరణాలు, హౌసింగ్ రుణాలు, పర్సనల్ లోన్లు తీసుకున్న ఉద్యోగులు ఒకటో తారీఖు వచ్చిందంటే భయాందోళనకు గురవుతున్నారు .సకాలంలో వేతనాలు అందకపోవడంతో ఈఎమ్‌ఐలు గడువులోపు చెల్లించలేకపోతున్నారు. దీంతో ఫైనాన్స్ సంస్థలు, బ్యాంకులు వేల రూపాయల అపరాధ రుసుము వేస్తున్నాయి. దీంతో ప్రభుత్వ శాశ్వత, తాత్కాలిక ఉద్యోగులతో పాటు పెన్షనర్లు దిక్కుతోచక ఇబ్బంది పడుతున్నారు. ప్రతి నెలా ప్రైవేటు ఫైనాన్స్ సంస్థలు, వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తూ కాలం వెలదీస్తున్నామంటూ పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పడిపోతున్న సిబిల్ స్కోర్.. లోన్లపై ప్రభావం

నిర్దేశించిన గడువులోపు కంతు చెల్లించని పక్షంలో చెక్ బౌన్స్ కావడంతో సిబిల్ స్కోర్ (క్రెడిట్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఇండియా లిమిటెడ్) భారీగా పడిపోతుంది. దీంతో సదరు వ్యక్తి క్రెడిట్ రికార్డ్‌పై మచ్చ ఏర్పడినట్టే. నూతన లోన్లను మంజూరు చేయడంలో సిబిల్ స్కోర్ కీలక పాత్ర పోషిస్తుంది. బ్యాంకుల నుంచి, ఇతర ఫైనాన్స్ సంస్థల నుంచి అప్పు పుట్టాలంటే క్రెడిట్ స్కోర్ కనీసం 750 పాయింట్లు ఉండాలి. 750 నుంచి 900వరకు ఉంటే లోన్లు తీసుకునేందుకు అర్హులుగా నిబంధనలు పెట్టాయి. అన్ని క్రెడిట్లు సక్రమంగా చెల్లించినా ఒక్క వాయిదా గడువులోపు చెల్లించకుంటే సిబిల్ స్కోర్‌పై తీవ్ర ప్రభావం పడుతుంది. దీంతో పెద్ద మొత్తంలో వేతనం వస్తున్న ఉద్యోగులకైనా నూతన లోన్లు మంజూరు చేయాలంటే బ్యాంకులు, ప్రైవేటు ఫైనాన్స్ సంస్థలు వెనుకడుగు వేస్తున్నాయి.

వణుకు పుడుతోంది



వేతనాలు సక్రమంగా రాకపోవడంతో నెల ప్రారంభమైందంటే వణుకుపుడుతోంది. గృహోపకరణాలను ఈఎంఐ కింద కొనుగోలు చేశాం. ప్రతి నెలా 3వతేదీ లోపు ఈఎంఐ కట్ అవుతుంది. బ్యాంకులో జీతాలు సకాలంలో జమ కావడం లేదు. దీంతో అప్పు చేయాల్సిన పరిస్థితి. వాటికి వడ్డీ కట్టలేక, కుటుంబ ఖర్చులకు కూడా ఇబ్బంది పడుతున్నాం. ఒక్క నెల ఈఎంఐ ఆలస్యమైనా అంతే సంగతులు. ఫైన్లతో పాటు సిబిల్ స్కోర్ పడిపోతుంది. మళ్లీ లోన్ ఇచ్చేందుకు బ్యాంకులు ముందుకు రావడం లేదు. గత ఆరు నెలల నుంచి ఇదే పరిస్థితి.

- ఎం.,మంజుల, వెటర్నరీ వర్సిటీ కాంట్రాక్ట్ వర్కర్

శత్రువుకు కూడా వద్దు



అగ్రికల్చరల్ కళాశాల హాస్టల్‌లో కాంట్రాక్ట్ ఉద్యోగిగా పనిచేస్తున్నా. జీతాలు సమయానికి అందించడంలో ప్రభుత్వం విఫలమైంది. ఒకటో తారీఖున చెల్లిస్తామని హామీలు ఇచ్చినా అమలు చేయడం లేదు. చిరు ఉద్యోగులమైన మాలాంటి వారు నెల ప్రారంభమైతే నరకం అనుభవించాల్సిందే. శత్రువుకు సైతం ఇలాంటి కష్టాలు రాకూడదని కోరుకుంటున్నా. నిత్యావసరాలతో పాటు, ఈఎంఐల చెల్లింపుల టార్చర్ తట్టుకోలేక పోతున్నాం. సక్రమంగా చెల్లించకుంటే సిబిల్ స్కోర్‌తో పాటు, క్రెడిట్ కార్డు లోన్ లిమిట్‌లో సైతం భారీగా కోత విధిస్తున్నారు.

- కె.నాగరాజు, అగ్రికల్చరల్ కళాశాల హాస్టల్ ఉద్యోగి

లోన్ ఇవ్వడం లేదు



మా కుటుంబంలో ఒకరు శాశ్వత ఉద్యోగి, మరొకరు పెన్షన్ దార్లు ఉన్నారు. ప్రముఖ వర్సిటీలో పనిచేస్తున్నారు. ఇద్దరి జీతాలు నెల 3వ తారీఖు లోపు బ్యాంకులో జమైతే ఎటువంటి సమస్యలు ఉండవు. అయితే వేతనాలను 10వ తేదీ పైనా, నెలాఖరుకు అందడంతో పరిస్థితి దారుణంగా మారుతోంది. గతంలో మా సిబిల్ స్కోర్ 800వరకు ఉండేది. గత ఏడాది నవంబర్‌లో ఈఎమ్‌ఐలు, క్రెడిట్ కార్డు చెల్లింపు ఆలస్యమవడంతో సిబిల్ స్కోర్ 450కి పడిపోయింది. హౌసింగ్ లోన్‌కోసం బ్యాంకుకు వెళ్లితే ఇద్దరు ఉద్యోగులపైనా లోన్ ఇచ్చేందుకు అనుమానిస్తున్నారు.

- సరస్వతీ, ప్రభుత్వ ఉద్యోగి సతీమణి

జీతాల మాటే మరిచారు



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మరుసటి నెల నుంచే ఒకటో తారీఖున అన్ని ప్రభుత్వ శాఖలలో పనిచేసే ఉద్యోగులకు వేతనాలు చెల్లిస్తామని హామీలు గుప్పించింది. కనీసం శాశ్వత ఉద్యోగులకు సైతం ఒకటో తారీఖున జీతాలు చెల్లించడం లేదు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల మాట చెప్పనక్కరలేదు. సక్రమంగా వేతనాలు చెల్లించకుంటే వర్కర్ల జీవితాలు ఎలా గడుస్తాయనే ఆలోచన సైతం చేయకపోవడం దారుణం. ఈఎమ్‌ఐలు నెల ప్రారంభం కాకుండానే నెత్తిన పడిపోతున్నాయి. ఒక నెల ఆలస్యంగా చెల్లిస్తే అప్పులు పుట్టే పరిస్థితి లేదు.

- ఎస్.సుభాన్, ఆప్కాస్ ఉద్యోగి

మాట నిలబెట్టుకోవాలి



ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్లకు ప్రతి నెలా 1, 2 తేదీల్లో జీతాలు చెల్లించాలి. ఎన్నికల హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోలేక పోవడం దారుణం. ప్రభుత్వ ఉద్యోగులకు వరాలు ఇవ్వలేకపోయినా శ్రమించిన వేతనం సక్రమంగా చెల్లించాలి. మేము ఓ ప్రముఖ బ్యాంకు నుంచి ఈఎంఐ ద్వారా ద్విచక్రవాహనంతో పాటు పర్సనల్ లోన్ తీసుకున్నాం. కా, పెన్షన్ సకాలంలో అందకపోవడంతో ఈఎమ్‌ఐలు, లోన్ కంతు చెల్లించేందుకు ప్రైవేటు వ్యక్తులను ఆశ్రయించాల్సిన దుస్థితి దాపురించింది. ప్రతి నెలా ఇదే తంతు సాగుతోంది. కూటమి ప్రభుత్వం వచ్చేనెల నుంచి అయినా సక్రమంగా జీతాలు చెల్లించి ఉద్యోగులు, పెన్షనర్లను ఆదుకోవాలి

- రామకృష్ణారెడ్డి, రిటైర్డ్ ఉద్యోగి

జీవితం అస్తవ్యస్తం



కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జీవితాలు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. శ్రమించినా ఫలితం సకాలంలో దక్కకపోవడంతో కుటుంబాలు గడవకపోగా ఈఎంఐ చెల్లింపుల కోసం అప్పులు చేస్తున్నారు. వచ్చే వేతనం కుటుంబావసరాలకు సరిపోకపోవడం, బ్యాంకులలో చెక్ బౌన్స్‌లు కావడంతో సిబిల్ స్కోర్‌లో వెనకబడి రుణాలు మంజూరు కావడం లేదు. వర్సిటీలలో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బంది, ప్రభుత్వ శాఖలలో పనిచేస్తున్న ఉద్యోగుల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ఒకటో తారీఖు వచ్చిందంటే వణికిపోతున్నారు. ప్రభుత్వం ఉద్యోగుల ఆగ్రహానికి గురికాక ముందే హామీ మేరకు ఒకటో తేదీనే వేతనాలు జమ చేయాలి

- చినబాబు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

'తల' ట్రైలర్ విడుదల


మాట్లాడుతున్న అమ్మ రాజశేఖర్

తిరుపతి సిటీ : కరకంబాడి రోడ్డులోని శ్రీరామ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం 'తల' చిత్ర ట్రైలర్‌ను విడుదల చేశారు. కొరియోగ్రాఫర్ అమ్మ రాజశేఖర్ మాట్లాడుతూ శ్రీవారి పాదాల చెంత సినిమా ప్రమోషన్‌కు రావడం సంతోషంగా ఉందన్నారు. సినిమా ఫిబ్రవరి 14న వ్యాలెంటైన్ డే సందర్భంగా విడుదల అవుతుందన్నారు. అమ్మ మీద ప్రేమ చూపించే కొడుకు పాత్రలో తన కుమారుడు అమ్మ రాగినీరాజ్ చక్కగా నటించాడని ప్రశంసించారు. హీరో మాట్లాడుతూ కుటుంబ కథా చిత్రాన్ని అందరూ ఆదరించారని కోరారు.

'రథసప్తమి'కి సర్వం సిద్ధం

తిరుపతి రూరల్ : తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో మంగళవారం రథసప్తమి వేడుకలకు సర్వం సిద్ధం చేశారు. ఈ క్రమంలో అమ్మవారు ఉదయం నుంచి రాత్రి వరకు ఏడు వాహనాలపై విహరిస్తూ భక్తులను కటాక్షించనున్నారు. ఈ మేరకు సూర్యనారాయణస్వామి ఆలయంలో సైతం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయాన్ని విశేషంగా అలంకరించారు.

వర్గీకరణ కోసం 'పోరు'

తిరుపతి కల్చరల్: ఎస్సీ వర్గీకరణే లక్ష్యంగా ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఈనెల 7వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించే లక్ష డప్పులు, వేల గొంతుల పోరు కార్యక్రమానికి జిల్లాలోని మాదిగలందరూ తరలిరావాలని ఎమ్మార్పీఎస్ నేత ఎం.నాగరాజు పిలుపు నిచ్చారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన లక్షల డప్పులు, వేల గొంతుల పోరు పోస్టర్ ఆవిష్కరించారు. నాగరాజు మాట్లాడుతూ వర్గీకరణ చేపట్టే వెసులుబాటును రాష్ట్ర ప్రభుత్వాలకు కల్పిస్తూ సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఈ మేరకు వర్గీకరణ చేసే తొలి రాష్ట్రంగా తెలంగాణ ఉంటుందని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారని వెల్లడించారు. అయితే కాంగ్రెస్‌లోని కొందరు నేతలు కుట్రపూరితంగా వ్యవహరిస్తూ రేవంత్‌రెడ్డిని ప్రభావితం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ నెల 7వ తేదీలోపు సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టంగా వర్గీకరణపై ప్రకటన చేయకుంటే కాంగ్రెస్‌కు గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. పోరు సభలో ఈ మేరకు చర్చిస్తామని వెల్లడించారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ నేతలు రాజేంద్ర మాదిగ, రామ్మూర్తి మాదిగ, మునిరత్నం, చెంగల్రాయులు, శంకర్ మాదిగ, వెంకటేష్ మాదిగ, లక్ష్మయ్య , గోపీ మాదిగ పాల్గొన్నారు.

ఉద్యోగుల సంక్షేమమే లక్ష్యం


కొత్త కమిటీ జాబితాను అందిస్తున్న నేతలు

తిరుపతి అర్బన్ : ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమమే లక్ష్యమని, ఆ మేరకు అండగా నిలవాలని డీపీటీఓ నరసింహులను ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కమిటీ కోరింది. సోమవారం ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా నూతన కమిటీ పరిచయ కార్యక్రమాన్ని డీపీటీఓ చాంబర్‌లో నిర్వహించారు. యూనియన్ నేతలు మాట్లాడుతూ న్యాయబద్ధంగా డ్యూటీల కేటాయింపు, ఉద్యోగులకు రావాల్సిన జీతభత్యాల సమస్యలను మాత్రమే తీసుకొస్తామని వెల్లడించారు. జిల్లా అధికారిగా తమ సమస్యను రాష్ట్ర స్థాయి అధికారులకు తెలియజేసి పరిష్కారం దిశగా కృషి చేయాలని కోరారు. డీపీటీఓ మాట్లాడుతూ తప్పకుండా ఉద్యోగులకు అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో ఈయూ నేతలు ఆవుల ప్రభాకర్ యాదవ్, మురగమ్మ, గురున్నాథం, సత్యనారాయణ, మస్తాన్, జీఆర్ చంద్ర, యస్, వర్మ, సుబ్రమణ్యం, సతీష్‌నాయుడు పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ నేతల విడుదలకు డిమాండ్



నిరసన వ్యక్తం చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నేతలు

తిరుపతి కల్చరల్ : అన్నమయ్య జిల్లాలో ముఖ్యమంత్రి బహిరంగ సభలో నిరసన తెలిపిన ఏఐఎస్ఎఫ్‌లను అరెస్ట్ చేయడం దుర్మార్గమని, వారిని వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బండి చలపతి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఉదయ్‌కుమార ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం ఈ మేరకు ఎమ్మార్‌పల్లె సర్కిల్‌లో నిరసన వ్యక్తం చేశారు. నేతలు మోహన్, హరికృష్ణ, చంద్ర నాయక్, రాజ్, సురేష్, సుబ్బు పాల్గొన్నారు.

26న జ్యోతిర్లింగేశ్వర ఆలయంలో శివరాత్రి వేడుకలు


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న గోపీనాథ్‌రెడ్డి తదితరులు

తిరుపతి కల్చరల్ : రేణిగుంట మండలం వెదుళ్ల చెరువు గ్రామంలోని శ్రీఓంకార్ జ్యోతిర్లింగేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 26వ తేదీన మహాశివరాత్రి వేడుకలు నిర్వహించనున్నట్లు రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి, ఆలయ ధర్మకర్త కృష్ణయ్యస్వామి తెలిపారు. సోమవారం రంగస్థలి కార్యాలయం వద్ద శ్రీఓంకార్ జ్యోతిర్లింగేశ్వరస్వామి మహాశివరాత్రి ఉత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ మహా శివరాత్రి సందర్భంగా ఉదయం 5 గంటలకు ప్రత్యేక అభిషేకం జరిపించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించనున్నట్లు వెల్లడించారు. 10 గంటలకు 30 అడుగుల మహా శివలింగానికి పాలాభిషేకం నిర్వహించనున్నట్లు చెప్పారు. అనంతరం అన్నప్రసాదాల వితరణ చేపడుతున్నట్లు తెలిపారు. 27న శివపార్వతుల కల్యాణ మహోత్సవం వైభవంగా చేపట్టనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు చంద్రశేఖర్ స్వామి, చెంగారెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, సురేష్ స్వామి, ఫణిభూషణ్‌రెడ్డి, జ్యోతి భాస్కర్, భానుప్రకాష్ పాల్గొన్నారు.

కురబ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా శ్రీనివాసులు

తిరుపతి కల్చరల్ : కురబ, కురుమ, కురువ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా జబ్బల శ్రీనివాసులు మూడో పర్యాయం ఎన్నికయ్యారు. సోమవారం ఈమేరకు ప్రెస్‌క్లబ్‌లో జబ్బల శ్రీనివాసులును కురబ సంఘం జిల్లా నేతలు ఘనంగా సత్కరించారు. శ్రీనివాసులు మాట్లాడుతూ గొర్రెల పెంపకమే జీవనాధారంగా బతుకులు వెళ్లదీసే అత్యంత వెనుకబడిన కులం కురబలని తెలిపారు. అలాంటి కురబల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు కుప్పం సభలో పలు హామీలు ఇచ్చారన్నారు. టీటీడీ బోర్డులో కురబలకు స్థానం కల్పిస్తామని, ఎమ్మెల్సీ అవకాశంఇస్తామని, రుణాలు మంజూరు చేయిస్తామని భరోసా ఇచ్చారని తెలిపారు. అయితే ఇప్పటి వరకు ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని మండిపడ్డారు. తమిళనాడు, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల తరహాలో కురబలను ఎస్టీ జాబితాల్లో చేర్చాలని డిమాండ్ చేశారు. అనంతరం రాష్ట్ర నూతన కమిటీని ప్రకటించారు. కురబ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధిగా నంజుడప్ప, కోశాధికారిగా సి.విఠల్‌గౌడ్, కార్యదర్శులుగా వి.వెంకటరమణ, సీతారామయ్య ,భీరయ్య, కృష్ణ గౌడ్, రెడ్డెన్న, పోతప్ప, పరమేష్, ఉపాధ్యక్షులుగా నాగేశ్వర, రెడ్డికుమార్, మద్దిలేటి, చలపతి, సంతోష్, ప్రచార కార్యదర్శిగా దుర్గాప్రసాద్, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా కె.బాబు, డి. రఘురాముడు, గోవిందరావు, హరినాథ్‌లతో పాటు 12 మంది సభ్యులను ఎన్నుకున్నట్లు తెలిపారు. అలాగే రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడిగా కాటమయ్య , వర్కింగ్ ప్రెసిడెంట్లుగా సురేష్, రామకృష్ణ, శ్రీనివాసులు, కోశాధికారిగా బి.మంజునాథ్ ,ఉపాధ్యక్షులుగా బండి కాశీ, పరమేష్, బండి కేశవ, కార్యదర్శిగా అంజి నియమితులైనట్లు వివరించారు.

అరాచకంపై ఆక్రోశం

కూటమి నేతల దౌర్జన్యాలపై కార్పొరేటర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాము బస చేసిన హోటల్లోకి అర్ధరాత్రి చొరబడి అరాచకం సృష్టించారని మండిపడుతున్నారు. రూము తలుపులను పగలగొట్టేందుకు యత్నించి బీభత్సం సృష్టించారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలని కూడా చూడకుండా దురుసుగా ప్రవర్తించారని వాపోయారు. అధికార బలంతతో అడుగడుగునా అడ్డగించి అవమానాలకు గురిచేశారని కార్పొరేటర్లు తమ ఆవేదనను మీడియా ముందు వ్యక్తం చేశారు. ఆదివారం అర్ధరాత్రి చిత్తూరులో జరిగిన దాష్టీకంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పరుగులు తీశామని వెల్లడించారు. భూమన అభినయ్‌రెడ్డి హుటాహుటిన చిత్తూరుకు చేరుకుని అండగా నిలబడి సురక్షితంగా తిరుపతికి తీసుకొచ్చారని వివరించారు.

– తిరుపతి తుడా, తిరుపతి మంగళం


కార్పొరేటర్ల బస్సును కార్లతో అడ్డుకుంటున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు , ఆయన తనయుడు మదన్


- కూటమి నేతల దౌర్జన్యం
- మహిళా కార్పొరేటర్లు బస చేసిన రూముల వద్ద బీభత్సం
- అడుగడుగునా అడ్డగింతలపై వైఎస్సార్‌సీపీ నేతల ఆగ్రహం


ఎస్వీయూ వద్ద పోలీసుల పహారా


నిబంధనలకు విరుద్ధంగా ఎస్వీయూలోకి వెళుతున్న టీడీపీ నేత నరసింహయాదవ్


గూండాల దాడిలో గాయపడిన మహిళా నేత

ఎప్పుడూ చూడలేదు



కార్పొరేటర్లపై టీడీపీ, జనసేన నేతలు చేసిన దౌర్జన్యం తిరుపతి చరిత్రలో ఎప్పుడూ చూడలేదు. ప్రలోభాలకు లొంగని వారితో అత్యంత పాశవికంగా వ్యవహరించారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారు. కూటమి పంచన చేరేందుకు ఇష్టం లేదని ఎంత వాదించినా వినకుండా ఆస్తులను ధ్వంసం చేశారు. మహిళా కార్పొరేటర్లతో దురుసుగా వ్యవహరించారు. సభ్య సమాజం తలదించుకునేలా ప్రవర్తించారు.

- లడ్డు భాస్కర్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ అభ్యర్థి

భయాందోళన సృష్టించారు



చిత్తూరులోని ఓ హోటల్లో మేము బస చేసిన విషయం తెలుసుకుని టీడీపీ, జనసేన నేతలు వందలాది మంది రౌడీమూకలతో వచ్చారు. అర్ధరాత్రి వేళ తలుపులు కొడుతూ అల్లర్లు సృష్టించారు. మహిళలు అని కూడా చూడకుండా రూముల్లోకి చొరబడి బెదిరింపులకు దిగారు. వారి అరుపులతో ఏం జరుగుతుందో తెలియక భయాందోళనకు గురయ్యాం. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని తిరుపతికి చేరుకున్నాం. ఓటింగ్‌కు వెళ్లేప్పుడు కూడా దాడులకు దిగారు. రాజకీయాలంటేనే అసహ్యం పుట్టేలా వ్యవహరించారు.

- ఆరణి సంధ్య, 19వ డివిజన్ కార్పొరేటర్

ఇళ్లపైకి వచ్చారు



ప్రలోభాలకు తలొగ్గలేదని మా ఇంటిపైకి జేసీబీలతో తెగబడి వచ్చారు. తమ అభ్యర్థికి మద్దతుగా నిలబడకుంటే మీ ఇల్లు, షాపు కూల్చేస్తామంటూ నానా హంగామా చేశారు. టౌన్‌ప్లానింగ్ సిబ్బంది, పోలీసులు భయాందోళన సృష్టించారు. వారి బెదిరింపులకు లొంగకపోవడంతో చేసేది లేక వెనుదిరిగారు. ప్రతి కార్పొరేటర్ ఇంటి వద్ద ఇదే హైడ్రామా నడిచింది. బలం ఉంటే మమ్మల్ని ఎందుకు అడ్డుకోవాలి. ఇది మంచిది కాదు.

- ఉమా అజయ్, 2వ డివిజన్ కార్పొరేటర్

సిగ్గుతో తలదించుకోవాలి.



ఒక్క కార్పొరేటర్ గెలిచిన టీడీపీ నేతలు డిప్యూటీ మేయర్ స్థానాన్ని ఆశించడం సిగ్గు చేటు. వైఎస్సార్‌సీపీ నుంచి గెలిచిన వారితో పదవిని దక్కించుకుకోవాలనుకోవడం దుర్మార్గం. నయానో, భయానో మమ్మల్ని లొంగదీసుకునేందుకు అరాచకం సృష్టించిన టీడీపీ, జనసేన నేతలు సిగ్గుతో తల దించుకోవాలి. వారికి దమ్ముంటే ప్రజాస్వామ్యయుతంగా గెలిచి చూపించాలి.

- కోటూరు ఆంజనేయులు, 13వ డివిజన్ కార్పొరేటర్

రాక్షస పాలన



ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో పోలీసులను పంపించి గందరగోళం సృష్టించారు. తెల్లవారు జామున ఇంటిపైకి రావడంతో పెద్దలు, పిల్లలు భయభ్రాంతులకు గురయ్యారు. ఇలా అధికార బలం ఉపయోగించి ఇళ్లపైకి మనుషులను పంపించడం దుర్మార్గమైన చర్య. ప్రజాస్వామ్యమంటే ఇదేనా? రాక్షసపాలన అంటే ఎలా ఉంటుందో కళ్లారా చూశాం. విషయం తెలుసుకున్న భూమన అభినయ్ వచ్చి మమ్మల్ని కాపాడారు.

- కేతం జానకి, 6వ డివిజన్ కార్పొరేటర్